క్లుప్తంగా

22 నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెం కోదండ రామాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలకు గణపతి పూజ, అఖండ దీపారాధన, కలశస్థాపన, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు జరుగుతాయన్నారు. 22వ తేదీన బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణ, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న లలితా త్రిపుర సుందరి, 26న మహాలక్ష్మి, 27న కాత్యాయనిదేవి, 28న మంగళగౌరీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీ మహిషాసురమర్దినీదేవి, 2వ తేదీన రాజరాజేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు సీహెచ్‌సీలో ఈఎన్‌టీ, డెర్మటాలజీ సేవలు

సీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఈఎన్‌టీ, డెర్మటాలజీ, ఆప్తమాలజీ వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ ప్రవీణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రిలో ఆయా విభాగాల సేవలు అందుబాటులో లేనప్పటికీ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తెనాలి ఆస్పత్రి నుంచి వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఆస్పత్రిలో బ్లడ్ డొనేషన్ క్యాంపు కూడా నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చని డాక్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. ప్రజలు ఆయా విభాగాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ప్రత్తిపాడు విద్యార్థినులు



ప్రత్తిపాడు: రాష్ట్ర స్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలకు ప్రత్తిపాడు హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 17వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–19 ఫుట్‌బాల్ సెలక్షన్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో జరిగాయి. ఈ ఎంపికల్లో ప్రత్తిపాడు భవనం వెంకటరెడ్డి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు సీహెచ్ రాఘవ, కె.పూర్ణిమ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22 నుంచి 24 వరకు కర్నూలులో జరగనున్న అండర్–19 స్టేట్ లెవల్ పోటీల్లో జిల్లా జట్టుకు ఆడనున్నట్లు హెచ్‌ఎం షేక్ అలీషా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థినులను, వారికి తర్ఫీదునిచ్చిన పీఈటీ షేక్ కరిముల్లాను పాఠశాల కమిటీ చైర్మన్ అబ్దుల్ రవూఫ్, హెచ్‌ఎం అలీషా అభినందించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ మల్లికార్జునకు ఉత్తమ అకడమిక్ లీడర్ అవార్డు



పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బోటనీ విభాగ ఆచార్యులు కొక్కంటి మల్లికార్జునకు ఉత్తమ అకడమిక్ లీడర్ అవార్డు లభించింది. బిహార్ కేంద్రంగా ఉన్న 360 రీసెర్చ్ ఫౌండేషన్, జాతీయ స్థాయి సంస్థ అందించే ఉత్తమ అకడమిక్ లీడర్ అవార్డు, నేషనల్ సృజన్ అవార్డు 2025కు ఆయన ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ ద్వారా గుర్తించబడి గ్రామీణ పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలకు 360 రీసెర్చ్ ఫౌండేషన్ కృషి చేస్తుంది. బయోడైవర్సిటీ, కన్సర్వేషన్ క్లెమైట్ యాక్షన్ అంశంపై చేపట్టిన పరిశోధనలను గుర్తించి ప్రొఫెసర్ కొక్కంటి మల్లికార్జునకు ఈ అవార్డు లభించింది. 360 రీసెర్చ్ ఫౌండేషన్ జనరల్ బాడీలో సభ్యులుగా ఆయన కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ప్రొఫెసర్ కొక్కంటి మల్లికార్జునను అభినందించారు.

ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ

అబ్బినేనిగుంటపాలెం(కాకుమాను): ఉపాధ్యాయులు ప్రతి రోజు ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ అన్నారు. పెదనందిపాడు మండలంలోని అబ్బినేనిగుంటపాలెం సెయింట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను గురువారం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా పది విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించి వెనకబడిన వారిని గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలకు హాజరయ్యే ప్రతి ఒక్కరు పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల పనితీరు పరిశీలించారు. హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

గజానికో గుంత.. ప్రజల అవస్థ







ప్రత్తిపాడు: సంక్రాంతి నాటికి గోతులు లేని రహదారులుంటాయి.. ఇవీ గత ఏడాది చివర్లో కూటమి నేతలు చెప్పిన మాటలు. కానీ వాస్తవంలో మాత్రం అందుకు పూర్తి భిన్నంగా క్షేత్ర స్థాయిలో 'రహ'దారు'లున్నాయి. మరో మూడు నెలల్లో మళ్లీ సంక్రాంతి వస్తున్నా.. గోతుల రోడ్లు మాత్రం బాగుపడిన దాఖలాలే లేవు. గ్రామాల్లో గోతుల రోడ్లు సంగతి అలా ఉంచితే.. మండల కేంద్రాల్లోని మెయిన్ రోడ్లు కూడా మోకాళ్ల లోతు గుంతలతో 'దారి'ద్య్రంగా తయారయ్యాయి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రాలు. పెదనందిపాడులోని మెయిన్ రోడ్డు (పాత మద్రాసు రోడ్డు) ఇలా భారీ గోతులతో, గజానికో గుంతతో దర్శనమిస్తుంది. రెండు మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు నిలవడంతో ఎక్కడ గోతులున్నాయో కూడా తెలియక ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతుంది. ఇదే మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు ఉంటాయి. రోడ్డు పొడవునా అనేక చోట్ల గుంతలు ఉండటంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే బాబోయ్ నడ్డి విరుగుతుంది రోయ్.. అంటూ జాగ్రత్తలు చెప్పి పంపాల్సిన దుస్థితి చోటు చేసుకుంటుంది. ఇప్పటికైనా కూటమి నాయకులు ఒట్టి మాటలు కట్టిపెట్టి తారు మాటలు చెప్పాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వసభ్య సమావేశం.. గరం గరం

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గళం విప్పిన ప్రజాప్రతినిధులు
- యూరియా, పేదల ఇళ్ల పట్టాలు.. వంటి సమస్యలపై ప్రశ్నాస్త్రాలు



సర్వసభ్య సమావేశంలో ప్రశ్నిస్తున్న కొత్తమల్లాయపాలెం సర్పంచ్ లక్ష్మారెడ్డి

ప్రత్తిపాడు: ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన ప్రశ్నలతో సర్వసభ్య సమావేశం గరం గరంగా మారింది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సభ సాక్షిగా ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో కె.శివపార్వతి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖల్లో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు.

గళం విప్పిన ప్రజా ప్రతినిధులు

- సమావేశంలో ప్రజా ప్రతినిధులు గళం విప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను వెనక్కు తీసుకుంటారని ప్రచారం జరుగుతోందని, ఇది నిజమా కాదా అని కొత్త మల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డిలు హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు.
- యూరియా అందక గ్రామాల్లో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, మా ఊరికి ఒకే ఒక్క ఎరువుల లోడు వచ్చిందని, ఆ ఒక్క లోడును అందరికీ ఇవ్వలేని పరిస్థితి అని గొట్టిపాడు ఎంపీటీసీ సామ్రాజ్యం వీరయ్య అడిగారు. అధికారులను అడిగితే చుట్టు పక్కల గ్రామాల్లో స్టాక్ ఉందని అక్కడి నుంచి తెచ్చుకోవాలని చెబుతున్నారన్నారు. మా ఊరికి రోడ్డు బాగోక ఎరువుల కట్ట కన్నా రవాణా చార్జీలు అధికమవుతున్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు.
- అదేవిధంగా ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతుకూ యూరియాను అందించాల్సిన అధికారులు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని కొండేపాడు సర్పంచ్ నర్రా రాంబాబు వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు.
- డ్వాక్రా (వెలుగు) అధికారులు కూడా విధుల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నారని, సమస్యలకు పరిష్కారం చూపకుండా కాలయాపన చేస్తూ అర్హులైన స్వయం సహాయక సభ్యులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు వెలుగు అధికారుల తీరుపై మండిపడ్డారు.

మా ఊర్లో కొందరు ఎలాంటి రుణమూ తీసుకోలేదని, కానీ ఆన్‌లైన్‌లో చూపిస్తుంది.. డబ్బులు కట్టండని అధికారులు వెంటపడటం ఏమిటని మండిపడ్డారు. తప్పు ఎక్కడ జరిగిందో.. తెలుసుకోకుండా డబ్బులు కట్టమని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి



చిన్నారుల బరువు కొలుస్తున్న సూపర్‌వైజర్ వెంకాయమ్మ



అవగాహన సదస్సులో ఐసీడీఎస్ అధికారులు



పాతమల్లాయపాలెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి

అప్పాపురం(కాకుమాను): గర్భిణి, బాలింత సమయంలో మహిళలు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని ఐసీడీఎస్ కాకుమాను సెక్టర్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని అప్పాపురం ఓసీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఊబకాయంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని ఆయిల్ ఫుడ్, ఫ్రైడ్ ఫుడ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పీచుపదార్థాలు, పాలు, ఆకుకూరలు వంటివి అధికంగా తీసుకోవాలని అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, శిశువుల బరువు, ఎత్తు కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రత్నకుమారి, సిబ్బంది ఉన్నారు.

స్థూలకాయం నివారణపై అవగాహన

గుంటూరు రూరల్: రోజువారీ ఆహారంలో చక్కెర, నూనె వినియోగం తగ్గిస్తే స్థూలకాయం కొంత వరకు నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి తెలిపారు. 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగర శివారులోని భాగ్యనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో స్థూలకాయం నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే స్థూలకాయంపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలన్నారు. చిన్న వయస్సు నుంచే వ్యాయామం అలవాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఈ నెల (సెప్టెంబర్) 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు నిర్వహిస్తోందని, దానిలో భాగంగా భాగ్యనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కె.వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ సునీల, శివలీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీ పరిధిలోని గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఊబకాయంతో అనారోగ్య సమస్యలు

ప్రత్తిపాడు: ఊబకాయంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలలో భాగంగా గురువారం మండల పరిధిలోని పాతమల్లాయపాలెం మెయిన్, తుమ్మపాలెం బీసీ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఊబకాయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఊబకాయం రావడానికి గల కారణాలు, నివారణ మార్గాలను మహిళలు, కిశోర బాలికలకు వివరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ మెరుగైన జీవనశైలి కోసం ఆహారంలో నూనె, చక్కెర వినియోగాన్ని తగ్గించాలన్నారు. ముప్పై సంవత్సరాలు దాటిన మహిళలు బీఎంఐ టెస్ట్ ఏఎన్‌ఎం ద్వారా చేయించుకోవాలని సూచించారు. ఆహారంలో స్వల్ప మార్పులు చేసుకోవడం ద్వారా ఊబకాయం, షుగర్, బీపీ, థైరాయిడ్, గుండె జబ్బులను నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.స్వాతి, వై.యమున, సీతామహాలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

22 నుంచి సాయి పుణ్యతిథి ఉత్సవాలు

పొన్నూరు: పట్టణంలోని సాయినగర్‌లో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు షిరిడి సాయిబాబా 107వ పుణ్యతిథి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు సాయి సేవా మండలి చైర్మన్ సర్రాజు మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటలకు సాయి సహస్ర నామ పూజ జరుగుతుందన్నారు. 22న ఉదయం విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, మందిర స్థల దాతలు ఆలపాటి శ్రీనివాసరావు, వేదకళ్యాణి దంపతులు కలశస్థాపన చేస్తారని తెలిపారు. 23న గీతామతం, 24న విష్ణు సహస్ర నామ పారాయణ, 25న సాయి భజన, 26న మధ్యాహ్నం పేదలకు వస్త్రదానం, రాత్రి లలితా సహస్రనామ పారాయణ, 27న గీతామతం, 28న సాయి చాలీసా పారాయణ, 29న గోవిందనామాల పారాయణ, 30న హనుమాన్‌చాలీసా పారాయణ, అక్టోబర్ 1వ తేదీన స్తవన మంజరి, 2న సాయి చరిత్రలోని 42, 43, 44, అధ్యాయాల పారాయణ, సాయంత్రం శమీ పూజ, హారతి, 3న సాయినాథుని నగరోత్సవం, 5న అన్నప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



అరెస్ట్ చేసిన గంజాయి విక్రేతలతో నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్ఐ మహేష్ తదితరులు

గుంటూరు రూరల్: వ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను చేస్తూ గంజాయి సేవిస్తున్న ముఠాను నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సౌత్ డీఎస్పీ భానోదయ నేతృత్వంలో గంజాయి విక్రయం, వినియోగం, సరఫరా చేస్తున్న వారిపై నిఘా పెట్టి ముమ్మర తనిఖీలు చేపట్టామని తెలిపారు. రూరల్ మండలంలోని వెంగళాయపాలెంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మహేష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి.. టిడ్కో గృహాల్లోని ఒక ఇంటిలో గంజాయి విక్రయిస్తుస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, అదే గ్రామానికి చెందిన చొప్పవరపు ప్రవీణ్, చల్లావారిపాలెంకు చెందిన జల్లెడ సాయిశ్రీనివాసరావులు క్యాటరింగు పనులు చేస్తూ, కొంత కాలంగా వెంగళాయపాలెంకు చెందిన ఇస్మాయిల్, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతానికి చెందిన హర్ష నుంచి గంజాయి కొనుగోలు చేసి, కొంత తాగుతూ.. కొంత విక్రయిస్తుంటారని తెలిపారు. అలాగే వెంగళాయపాలెంలో లైటింగ్ పనులు చేసుకుంటున్న చీలి వెంకటేష్, చీలి వెంకటసాయి, చుక్క ఆనందబాబు, కోబాల్డ్‌పేటకు చెందిన మేక అజయ్‌కుమార్‌లకు గంజాయిని విక్రయించారని విచారణలో తెలిపారన్నారు. వారి వద్ద నుంచి 1.23 కేజీల గంజాయి సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న ఇస్మాయిల్, హర్ష పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు. గంజాయి ముఠాను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ, ఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారని సీఐ తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టని పాలకులు

కాకుమాను: ప్రస్తుత పాలకులకు ప్రజా సమస్యలు పట్టడం లేదని గ్రామాలలో ఎక్కడ చూసినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని సీపీఎం పెదనందిపాడు అధ్యక్షుడు దొప్పలపూడి రమేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకుమాను మండలంలోని కొండపాటూరు, కొమ్మూరు, గార్లపాడు, కాకుమాను గ్రామాలలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సమస్యలపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాలలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని.. అనేక మంది విష జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు గ్రామాలలో బ్లీచింగ్ చల్లి సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్‌చేశారు. కాకుమాను పీహెచ్‌సీ ఎదురుగా కొత్తకుంటపై సుమారు 15 ఎస్టీ కుటుంబాలు పూరిపాకలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయని నేటికి వారికి నివేశన స్థలాలు, ఆధార్, రేషన్‌కార్డులు లేవని అధికారులు వెంటనే ఆ కుటుంబాలకు కార్డులు మంజూరు చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని కొండపాటూరు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కొత్త వెంకట శివరావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని వినతి

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీటి నుంచి రక్షణ కల్పించాలని వైఎస్సార్‌సీపీ చేబ్రోలు–4 ఎంపీటీసీ ఇంటూరి జయపాల్‌రెడ్డి గురువారం స్థానిక పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కొత్తరెడ్డిపాలెంలో వీధి కుక్కలు చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు వీధి కుక్కల నుంచి ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీధి కుక్కలకు స్టెరిలైజ్ చేసి, వ్యాక్సినేషన్, డీ వార్మింగ్ చేయాలన్నారు. రాబీస్ లేదా తీవ్ర ఆక్రోశ లక్షణాలు ఉన్న కుక్కలను ప్రత్యేక సంరక్షణ కేంద్రాల్లో ఉంచాలని సుప్రీంకోర్టు పేర్కొందన్నారు. అత్యున్నత న్యాయస్థానం మార్గదర్శకాలు అనుసరించి కుక్కల బెడదకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన వినతిపత్రంలో కోరారు.

ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు రూరల్: ఎలుకల మందు తిని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దాసరిపాలెం గ్రామానికి చెందిన వీరాస్వామి (24) స్థానికంగా మరో మహిళతో వివాహేతర సంబంధం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన ఆ మహిళతో కలిసి ఉండగా భార్యా బంధువులు పట్టుకుని మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వీరాస్వామి ఎలుకల మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఏఎన్‌యూలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పించాలి



వీసీ ఆచార్య గంగాధరరావును కలసిన ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వీసీ గంగాధరరావును కలిసి కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు పాలెం నాసరయ్య మాట్లాడుతూ యూజీసీ నెట్‌తో పాటు గ్రూపు 1, గ్రూపు 2, 3, 4, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్, డీఎస్సీ వంటి వాటికి విద్యార్థులు ఎక్కువమంది అర్హత సాధించేలా విశ్వవిద్యాలయం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ అవసరమన్నారు. విశ్వవిద్యాలయం చొరవ తీసుకుని ఈ ప్రోగ్రామ్‌లు అమలు చేయాలన్నారు. దీనికి స్పందించిన వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ఎవరెవరికి ఏ నైపుణ్య శిక్షణలు అవసరమో, ఎంతమందికి అవసరమో స్పష్టమైన జాబితా ఇస్తే, యూనివర్సిటీ తరపున పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. విద్యార్థులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఆలోచనలు బాగున్నాయని, వీటిని వర్సిటీ చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షులు అర్జున్, వెంకటేశ్వర్లునాయక్, శ్రీకాంత్, కార్యదర్శి జాన్ సైదా, డేవిడ్, మరియబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియంవద

ప్రత్తిపాడు: మహిళలకు ఇంటి వద్దనే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడం జరుగుతుందని పెదనందిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియంవద అన్నారు. పెదనందిపాడు పీహెచ్‌సీ పరిధిలోని పాలపర్రులో గురువారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రియంవద ఆధ్వర్యంలో కిశోర బాలికలకు ఆరోగ్య పరీక్షలు, మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. చంటి పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియంవద మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందికి మహిళలు సహకరించాలని, వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్.ఆర్.ప్రసాదస్వామి, హెచ్‌ఈ ఎస్‌కే సుజ, ఎంపీహెచ్ ఎస్.చెన్నయ్య, డీటీసీ ఎంపీహెచ్‌ఎస్ జి.శ్రీనివాసరావు, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంతర పట్టుదలతోనే ఆవిష్కరణలు సాధ్యం

పద్మశ్రీ అవార్డు గ్రహీత సీహెచ్ మల్లేశం





పద్మశ్రీ అవార్డు గ్రహీత మల్లేశంతో డీన్లు, విద్యార్థులు

చేబ్రోలు: విద్యార్థులు ఏదైనా ఆవిష్కరణలు చేయాలనుకుంటే నిరంతర తపన, పట్టుదల ఉండాలని, విమర్శకుల మాటలను పట్టించుకోకుండా లక్ష్యం వైపు అడుగులు వేయాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత సీహెచ్ మల్లేశం అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఇట్స్ మై స్టోరీ' అనే ఇతివృత్తంతో గురువారం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లేశం మాట్లాడుతూ పటాసరాలు తయారు చేసే సమయంలో తన తల్లి గంటల తరబడి కూర్చుని 'అసు' పని చేస్తుండేదని, దీని వల్ల ఆమెకు భుజాలు, చేతులు నొప్పితో బాధపడేదని అన్నారు. ఒక చీరకు అసు పోయాలంటే దాదాపు 9000 సార్లు చేతిని అటు ఇటూ తిప్పాల్సి వచ్చేదన్నారు. తన తల్లి కష్టాన్ని తగ్గించడానికి అసు యంత్రం తయారు చేయాలనే సంకల్పం మొదలైందన్నారు. యంత్రం తయారీకి అవసరమైన భాగాలు కొనడానికి సరిపడా డబ్బు లేక అప్పులు చేసి, చిన్న చిన్న పనులు చేసి డబ్బు సేకరించానని వెల్లడించారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని.. ఇలా దాదాపు 7 సంవత్సరాలు నిరంతర ప్రయత్నం తర్వాత 'అసు యంత్రం' విజయవంతమైందని విద్యార్థులతో పంచుకున్నారు. ఈ యంత్రంతో సమయం, శ్రమ ఆదా అవుతాయన్నారు. మొదట మెకానికల్‌గా తయారుచేశానని, తర్వాత ఎలక్ట్రానిక్ పరికరాలతో, ప్రస్తుతం మైక్రో ప్రాసెసర్లతో ప్రోగ్రామింగ్ చేసి వివిధ రకాల డిజైన్‌లను అందించే అసు యంత్రాన్ని తీసుకువచ్చానని వెల్లడించారు. ఇప్పటి వరకు దాదాపు 2500కు పైగా యంత్రాలను తయారుచేసి చేనేత కార్మికులకు అందించానని, నేడు వస్తున్న ప్రతి పోచంపల్లి చీర... తాను తయారుచేసిన అసు యంత్రంపై తయారయినవేనన్నారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, డైరెక్టర్లు, విజ్ఞాన్ ఈ–సెల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ రంగంతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతన కోర్సు బీఎస్సీ ఫైర్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ (రెగ్యులర్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్) ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైర్ అండ్ సేఫ్టీ (ఎన్‌ఐఎఫ్‌ఎస్) సంయుక్తంగా అందిస్తున్న ఈ వినూత్న కోర్సు, ఫైర్ అండ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ రంగాలలో నిరుద్యోగులైన యువతకు ఉజ్వలమైన భవిష్యత్తును ఇస్తుందన్నారు. నైపుణ్యవంతులైన నిపుణులను తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థులకు ఉన్నతమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఫైర్ అండ్ సేఫ్టీ రంగంతో నేటి యువతకు ఉజ్వల భవిష్యత్తు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఎన్‌ఐఎఫ్‌ఎస్ విద్యాసంస్థల అధినేత సునీల్ మహంతి, కుసుమ కుమారి, జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ డాక్టర్ జీపీఆర్ కృష్ణ, జనరల్ మేనేజర్ ప్రాజెక్ట్స్ అరుణ్‌కుమార్ పాణిగ్రాహి, ఎన్‌ఐఎఫ్‌ఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.